# ఆకాశవాణి విజయవాడ కేంద్రం

## ప్రాంతీయ వార్తా విభాగం

## ప్రాంతీయ వార్తలు

**తేది : 05-10-2025** **సమయం : 6.45 గంటలు**

# ముఖ్యాంశాలు

1. **ఆంధ్రప్రదేశ్ లో ఆటో డ్రైవర్ల కోసం ప్రత్యేకంగా యాప్ ను అందుబాటులోకి తీసుకురానున్నట్లు ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు తెలిపారు.**

2. **వంశధార నది ఒడ్డునున్న గ్రామాలకు వరద ముప్పు నుంచి శాశ్వత పరిష్కారం చూపుతామని కేంద్ర పౌర విమానయాన శాఖ మంత్రి కె.రామ్మోహన్ నాయుడు వెల్లడించారు.**

3. **ప్రతి ఇంటికి స్వచ్ఛమైన తాగునీరును అందించాలన్న లక్ష్యంతో పనిచేస్తున్నట్లు ఆంధ్రప్రదేశ్ పురపాలక శాఖ మంత్రి పి.నారాయణ పేర్కొన్నారు.**

4. **తెలంగాణా ప్రభుత్వం అభివృద్ధి, సంక్షేమం రెండిటికీ సమ ప్రాధాన్యత ఇస్తున్నట్లు రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ స్పష్టం చేశారు.**

5. **'స్వస్థ్ నారీ సశక్త్ పరివార్ అభియాన్' ప్రత్యేక వైద్య శిబిరాల్లో 57 లక్షల 11 వేల మంది వైద్య సేవలు పొందారని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రి వై.సత్యకుమార్ యాదవ్ తెలిపారు.**

==========================

ఆంధ్రప్రదేశ్ లో ఆటో డ్రైవర్ల కోసం ప్రత్యేకంగా యాప్‌ను అందుబాటులోకి తీసుకురానున్నట్లు ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు తెలిపారు. ఆటోడ్రైవర్లు ఆధునిక సాంకేతికతను అందిపుచ్చుకోవాలని సూచించారు. 'ఆటో డ్రైవర్ల సేవలో' పథకాన్ని విజయవాడలో ముఖ్యమంత్రి నిన్న ప్రారంభించారు. ఏడాదికి 15 వేల రూపాయల చొప్పున ఆర్థిక సాయాన్ని 2 లక్షల 90 వేల 669 మంది డ్రైవర్లకు కలిపి మొత్తం 436 కోట్ల రూపాయలను వారి ఖాతాల్లో ప్రభుత్వం జమ చేసింది. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి మాట్లాడుతూ..

వాయిస్...33 సెకన్లు

మరోవైపు రాష్ట్ర వ్యాప్తంగా వివిధ ప్రాంతాల్లో 'ఆటో డ్రైవర్ల సేవలో' పథకం కింద మంత్రులు, ఎమ్మెల్యేలు, అధికారులు డ్రైవర్లకు చెక్కులు పంపిణీ చేశారు.

--------------------------

తెలంగాణలో వారం రోజుల్లో కాటన్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా – సీసీఐ ద్వారా పత్తి కొనుగోళ్లను

చేపట్టేందుకు చర్యలు తీసుకుంటామని వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు తెలిపారు. హైదరాబాదులోని క్యాంపు కార్యాలయంలో ఈ అంశంపై ఆయన నిన్న సమీక్ష నిర్వహించారు. అధిక వర్షాల వల్ల ఆశించిన మేర పంట దిగుబడులు రాలేదన్నారు. వచ్చే వారం ఎట్టి పరిస్థితుల్లోనూ కొనుగోళ్లు ప్రారంభించాలని మంత్రి స్పష్టంచేశారు.

---------------------------

ఆంధ్రప్రదేశ్‌లోని శ్రీకాకుళం జిల్లాలో వంశధార నది ఒడ్డునున్న గ్రామాలకు వరద ముప్పు నుంచి శాశ్వత పరిష్కారం చూపుతామని కేంద్ర పౌర విమానయాన శాఖ మంత్రి కె.రామ్మోహన్ నాయుడు తెలిపారు. హిర మండలం తుంగతంపర గ్రామంలో.. వంశధార నదికి గండి పడిన ప్రదేశాన్ని, కల్లట గ్రామంలో ముంపునకు గురైన వరి పంట పొలాలనూ ఆయన నిన్న పరిశీలించారు. ఈ సందర్భంగా కేంద్ర మంత్రి మాట్లాడుతూ..

వాయిస్... 32 సెకన్లు

---------------------------

హైదరాబాద్ లోని జూబ్లీహిల్స్ నియోజకవర్గంలో 7 కోట్ల 18 లక్షల రూపాయల వ్యయంతో పలు సీసీ రోడ్ల నిర్మాణానికి తెలంగాణ రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ నిన్న శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. ప్రజా ప్రభుత్వంలో అభివృద్ధి, సంక్షేమం రెండిటికీ ప్రాధాన్యత ఇస్తున్నట్లు చెప్పారు. పనులను నిర్దేశిత సమయంలో పూర్తయ్యేలా చూడాలని అధికారులను ఆదేశించారు. హైదరాబాద్ బ్రాండ్ ఇమేజ్ కాపాడేందుకు ముఖ్యమంత్రి అన్ని చర్యలు తీసుకుంటున్నారని పేర్కొన్నారు.

---------------------------

ప్రతి ఇంటికి స్వచ్ఛమైన తాగునీరును అందించాలన్న లక్ష్యంతో పనిచేస్తున్నట్లు ఆంధ్రప్రదేశ్ పురపాలక శాఖ మంత్రి పి.నారాయణ తెలిపారు. తిరుపతి అభివృద్ధిపై తుడా కార్యాలయంలో అధికారులతో మంత్రి సమీక్ష సమావేశాన్ని నిన్న నిర్వహించారు. అనంతరం ఆయన పాత్రికేయుతో మాట్లాడుతూ.. అవసరమైన నిధులు కేటాయించి మురుగు కాలువల నిర్మాణాలను త్వరగా పూర్తి చేస్తామన్నారు. అన్ని మున్సిపాలిటీల్లో మురుగు కాలువల ఏర్పాటును పూర్తి చేయాలని ముఖ్యమంత్రి ఆదేశించారని పేర్కొంటూ..

వాయిస్... 32 సెకన్లు

---------------------------

'స్వస్థ్ నారీ సశక్త్ పరివార్ అభియాన్' నినాదంతో రాష్ట్రంలో గత నెల 17 నుంచి ఈ నెల 2వ తేదీ వరకూ నిర్వహించిన ప్రత్యేక వైద్య శిబిరాల్లో 57 లక్షల 11 వేల మంది మహిళలు, చిన్నారులు వైద్య సేవలు పొందారని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రి వై.సత్యకుమార్ యాదవ్ తెలిపారు. కేంద్ర ప్రభుత్వం పిలుపు మేరకు 26 జిల్లాల్లో 25 వేల 192 వైద్య శిబిరాలు నిర్వహించినట్లు మంత్రి ఒక ప్రకటనలో తెలిపారు. ప్రధానమంత్రి నరేంద్ర మోడీ పేదల అభ్యున్నతి, మహిళల ఆరోగ్యంపై ప్రత్యేక దృష్టిసారించి దేశ వ్యాప్తంగా అన్ని రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాల్లో ఏకకాలంలో ఈ వైద్య శిబిరాలను నిర్వహించారని పేర్కొన్నారు.

---------------------------

రైతులు అభివృద్ధి చెందితేనే గ్రామాలు అభివృద్ధి చెందుతాయని పోలవరం శాసన సభ్యులు చిర్రి బాలరాజు పేర్కొన్నారు. ఆంధ్రప్రదేశ్‌లోని ఏలూరు జిల్లా కొయ్యలగూడెం మండల కేంద్రంలో "సూపర్ జీఎస్టీ–సూపర్

సేవింగ్స్" కార్యక్రమంలో భాగంగా నిర్వహించిన ట్రాక్టర్ల ర్యాలీని ఆయన నిన్న ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. రైతుల అభివృద్ధి కోసం ప్రభుత్వం అనేక పథకాలను అమలు చేస్తోందన్నారు.

-----------------------------

దేశ వ్యాప్తంగా చిన్నారుల ఆరోగ్య పరిరక్షణ కోసం కేంద్ర ప్రభుత్వం సెప్టెంబర్ 17వ తేదీ నుంచి అక్టోబరు 16 వరకు పోషకాహార మాసంగా నిర్వహిస్తోంది. పిల్లల ఆరోగ్యాన్ని సంరక్షించి వారిని ఆరోగ్య వంతులుగా తీర్చి దిద్దడమే ఈ కార్యక్రమ నిర్వహణలోని ముఖ్యోద్దేశం. ఇందు కోసం ప్రత్యేక సమయాన్ని కేటాయించాలన్న ఉద్దేశ్యంతో పోషకాహార మాసం నిర్వహిస్తున్నారు. బాల బాలికల ఆరోగ్య పరిరక్షణకు ఈ సందర్భంగా పలు కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు.

-----------------------------

అహ్మదాబాద్ వేదికగా వెస్టిండీస్‌తో జరుగుతున్న మొదటి టెస్ట్ మ్యాచ్‌లో భారత జట్టు ఇన్నింగ్స్ 140 పరుగుల తేడాతో గెలిచింది. మూడో రోజు ఆట ప్రారంభానికి ముందే భారత్.. రెండోరోజు ఓవర్‌నైట్ స్కోర్ 5 వికెట్ల నష్టానికి 448 పరుగుల వద్ద తన తొలి ఇన్నింగ్స్‌ను డిక్లేర్ చేసి, వెస్టిండీస్ ముందు 286 పరుగుల లక్ష్యాన్ని నిర్దేశించింది. అనంతరం రెండో ఇన్నింగ్స్ ప్రారంభించిన వెస్టిండీస్ 146 పరుగులకే ఆల్ అవుట్ అయ్యింది. ఈ సిరీస్ లో రెండవ టెస్ట్ మ్యాచ్ ఢిల్లీలో ఈ నెల 10వ తేదీన జరుగనుంది.

-----------------------------

ప్రభుత్వం వయోవృద్ధుల సంక్షేమానికి నిబద్ధతతో కృషి చేస్తుందని ఆంధ్రప్రదేశ్ విభిన్న ప్రతిభావంతులు, వయోవృద్ధుల సంక్షేమ శాఖ కార్యదర్శి సూర్య కుమారి తెలిపారు. గుంటూరు కలక్టరేట్‌లోని నిన్న జరిగిన అంతర్జాతీయ వయోవృద్ధుల దినోత్సవంలో ఆమె మాట్లాడుతూ.. వయోవృద్ధుల సమస్యలను సత్వరమే పరిష్కరించేలా చర్యలు తీసుకుంటున్నామన్నారు. రాష్ట్రంలో వృద్ధాశ్రమాల సంఖ్యను 84 కు పెంచడం జరిగిందన్నారు. మరో 13 ఏర్పాటు చేసేందుకు ప్రతిపాదనలు సమర్పించామన్నారు.

-----------------------------

ఆంధ్రప్రదేశ్, యానాం దిగువ ట్రోపో ఆవరణంలో వాయవ్య, నైరుతి గాలులు వీస్తున్నాయని అమరావతి వాతావరణ కేంద్రం వెల్లడించింది. దీని ప్రభావంతో రాష్ట్రంలో రానున్న రెండు రోజులపాటు తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురిసే అవకావముందని వాతారవరణ శాఖ అధికారి ఎం.వెంకట్రావు తెలియజేస్తూ,

..వాయిస్.. 23 సెకన్లు

తెలంగాణలోనూ ఈరోజు, రేపు ఉరుములు, మెరుపులతో కూడిన చిరజల్లులు కురిసే అవకాశం ఉందని హైదరాబాద్ వాతావరణ కేంద్రం వెల్లడించింది.

-----------------------------

ఆంధ్రప్రదేశ్ లోని స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ ప్రకటించిన పురస్కారాలలో 4 రాష్ట్ర స్థాయి అవార్డులను పట్టణ పేదరిక నిర్మూలనా సంస్థ సాధించిందని ఆ సంస్థ మేనేజింగ్ డైరెక్టర్ ఎన్.తేజ్ భరత్ తెలిపారు. ఉత్తమ సామాజిక మాధ్యమ నిర్వహణ అవార్డుతో పాటు, ఇతర విభాగాల్లో మరో మూడు అవార్డులను సాధించినట్లు వెల్లడించారు. విజయవాడలో రేపు జరిగే కార్యక్రమంలో ఈ అవార్డులను అందుకోనున్నట్లు తెలిపారు.

======================